వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 309
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
సెప్టెంబర్ 20, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


2లో..

## 22 నుంచి భద్రకాళీ శరన్నవరాత్ర మహోత్సవాలు

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- భారీ బందోబస్తు, ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన భద్రకాళి శేషు, ఈఓ రాముల సునీత


8లో..

## ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- కమిషనర్ తో కలిసి బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన


8లో..

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ముందస్తు ఉత్సవాలు



## పూల వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

శనివారం హనుమకొండ పరిధి బాలసముద్రంలోని పెట్ పార్క్ తో పాటు మార్కెట్ ప్రాంతంలో కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతం చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులు వ్యాపారాలు చేసుకొని వెళ్లి పోయే క్రమంలో పోగైన చెత్త వ్యర్థాలను అలాగే వదిలి వెళ్ళిపోకుండా గార్బేజ్ లో వేసే వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని డ్రైన్ ల నుండి తొలగించిన వ్యర్థాలను 24 గంటలలోగా తొలగించాలన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పెద్ద మొత్తంలో పూలను వినియోగిస్తారని మిగిలి పోయిన పూల వ్యర్థాలను సేకరించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. – **వరంగల్ వాయిస్, వరంగల్**




# అమెరికా డోర్ క్లోజ్..

వివరాలు 2లో..

- భారత్‌కు షాక్‌ల మీద షాక్‌లు
- హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుం భారీగా పెంపు
- ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాలంటూ ఆర్డర్
- సన్నగిల్లుతున్న ఉద్యోగావకాశాలు
- పిచ్చోడి చేతిలో రాయిలా ట్రంప్ నిర్ణయాలు

అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి భారత్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే భారీ పన్నులతో భారత ఎగుమతులను దెబ్బకొట్టిన ట్రంప్.. తాజాగా అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే భారతీయులకు డోర్ క్లోజ్ చేశారు. హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచేశారు. హెచ్1బీ వీసా వార్షిక రుసుమును లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై శుక్రవారం సంతకం చేశారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ ఉత్తర్వు ప్రకారం ఇకపై అమెరికా వేదికగా పని చేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకోవాలంటే ఇకపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగుల్లో దాదాపు 71 శాతం మంది భారతీయులే ఉంటారు. అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను నియమించుకునే వీలు కల్పిస్తూ అమెరికా ప్రభుత్వం 1990లో హెచ్1బీ వీసాకు శ్రీకారం చుట్టింది. సాధారణ చార్జీలు చెల్లించి హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకుంటే లాటరీ విధానంలో ఎంపిక చేసేవారు. అయితే ఈ విధానాన్ని ట్రంప్ పూర్తిగా రద్దు చేసి కొత్తగా ఏడాదికి లక్ష డాలర్ల నిబంధన తీసుకురావడంతో అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలుగంటున్న భారతీయుల కథ కంచికే చేరనుంది.
- వరంగల్ వాయిస్ ప్రతినిధి

# అమెరికా డోర్ క్లోజ్..




- భారత్‌కు షాక్‌ల మీద షాక్‌లు
- హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుం భారీగా పెంపు
- ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాలంటూ ఆర్డర్
- సన్నగిల్లుతున్న ఉద్యోగావకాశాలు
- పిచ్చోడి చేతిలో రాయిలా ట్రంప్ నిర్ణయాలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను నియమించుకునే వీలు కల్పిస్తూ అమెరికా ప్రభుత్వం 1990లో హెచ్ 1బీ వీసాను తీసుకొచ్చింది. ఈ వీసాను ఉపయోగించుకుని ఎంతోమంది విదేశీ నిపుణులు అమెరికాలో ప్రవేశించారు. ఏడాదికి 85 వేల వీసాలను అమెరికా లాటరీ విధానం ద్వారా జారీ చేస్తోంది. ఈ వీసా కోసం దరఖాస్తు చేసేందుకు ముందుగా సాధారణ ఛార్జీలు చెల్లించాలి. లాటరీలో ఎంపికైనవారు అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా కంపెనీలే ఉద్యోగుల హెచ్ 1బీ వీసా ఛార్జీలను చెల్లిస్తుంటాయి. అయితే ప్రస్తుతం ఆ ఫీజును భారీగా పెంచేయడంతో కంపెనీలు పెను భారాన్ని ఎదుర్కోక తప్పదు. కొత్త హెచ్ 1బీ వీసా విధానం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులకు నిజంగానే ఇది పిడుగులాంటి వార్త.



## పిచ్చోడి చేతిలో రాయి..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో అధికారం.. పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అని ఆందోళన చెందుతున్నారు. ఎందుకు ఓటేశామా.. అని నెత్తీనోరు బాదుకుంటున్నారు. ట్రంప్ ఎప్పుడు ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఇలాంటి నిర్ణయాలతో విదేశీయులతో పాటు, అమెరికన్లు కూడా తీవ్ర ప్రభావానికి లోనవుతున్నారు. ప్రధానంగా ఉద్యోగాలు కుంచించుకు పోతున్నాయి. ఉపాధి దొరకడం కష్టంగా మారింది. విదేశీయులపై ఆంక్షలు, ట్రంప్ సుంకాల వల్ల అమెరికా ఆర్థిక పరిస్థితి దిగజారిపోతోంది. ఎప్పుడు మాంద్యం ముంచుకొస్తుందోనన్న భయం వెన్నాడుతోంది. తాజాగా హెచ్ 1 బి వీసాలపై ట్రంప్ తీసుకున్న నిర్ణయం కంపెనీలకు షరాఘాతంగా మారనుంది.

## అమెరికన్లకు ట్రైనింగ్ ఇవ్వండి..

మీరు ఎవరికైనా శిక్షణ ఇవ్వదలుచుకుంటే ఇటీవల మన దేశంలోని గొప్ప యూనివర్సిటీల నుంచి పట్టభద్రులైన మన వారికి ఇవ్వండి. అమెరికన్లకే ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. మన ఉద్యోగాలను కొల్లగొడుతున్న వారిని ఇతర దేశాల నుంచి తీసుకురావడం ఆపాలంటూ ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి టెక్నాలజీ రంగం మద్దతు ఇస్తుందన్నారు. ఈ నిర్ణయంతో వారు చాలా సంతోషిస్తారని తెలిపారు. ఇదే అభిప్రాయాన్ని అమెరికా కామర్స్ సెక్రటరీ హోవర్డ్ వ్యక్తం చేశారు. ఐటీ కంపెనీలు అమెరికన్లనే నియమించుకోవాలని, పనికి రాని వ్యక్తులను అమెరికాలోకి రావడాన్ని ఆపేయాల్సిందేనంటూ హోవర్డ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ నిర్ణయంపై దిగ్గజ టెక్ కంపెనీలు అయిన యాపిల్, గూగుల్, మెటా ఇంతవరకు స్పందించలేదు.

## చట్టాలు అడ్డుకునేనా..?

ట్రంప్ సుంకాల యుద్ధం ఫలితంగా .. ఈ ఏడాది తొలి త్రైమాసికం జనవరి–మార్చిలో అమెరికా జీడీపీ 0.50 శాతం క్షీణించగా.. రెండో త్రైమాసికం ఏప్రిల్–జూన్‌లో మాత్రం 3.3 శాతం వృద్ధిని నమోదు చేయగలిగింది. ప్రస్తుతం అమెరికా పరిస్థితి చావుతప్పి కన్ను లొట్టబోయినట్లుగా ఉంది. పెరుగుతున్న ధరలు, సుంకాలతో పెరిగిన వాణిజ్య అనిశ్చితి, తగ్గుతున్న కొనుగోళ్లు ముందు త్రైమాసికాల్లో ఆ దేశ జీడీపీని మాంద్యంలోకి నెట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాజా నిర్ణయాలు మరింత సంక్షోభానికి కారణం అవుతాయని అంటున్నారు. విదేశీ నిపుణులు ముఖ్యంగా భారతీయులు తిరిగి సొంత దేశానికి వెళితే అమెరికాలో పనిచేసే వారు కరువవుతారని ఆందోళన చెందుతున్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలను అక్కడి చట్టాలు అడ్డుకుంటాయా లేదా అన్నదానిపై తుది ఫలితం ఆధారపడి ఉంటుంది.

## మండిపడుతున్న నెటిజన్లు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్–1 బి వీసాల నియమాలను మార్చారు. ఈ సందర్భంగా యూఎస్ కామర్స్ సెక్రెటరీ హోవర్డ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఐటీ కంపెనీలు అమెరిక్లనే నియమించుకోవాలని సూచించారు. పనికి రాని వ్యక్తులను అమెరికాలోకి రావడాన్ని ఆపేయాల్సిందే అని పేర్కొన్నారు. కేవలం అత్యుత్తమ విలువైన వ్యక్తులు మాత్రమే యూఎస్ లో అడుగు పెట్టాలని తెలిపారు. హెచ్ 1–బి వీసాలతో అమెరికా వెళ్లేది ఎక్కువగా భారతీయులేనని, హోవర్డ్ వ్యాఖ్యలు తమ దేశాన్ని అవమానించే విధంగా ఉన్నాయని సోషల్ మీడియాలో నెటిజన్స్ తీవ్రంగా మండిపడుతున్నారు. అయితే, అమెరికా వీసా నిబంధనల్లో డొనాల్డ్ ట్రంప్ మళ్లీ మార్పులు చేశాడు. వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచేశాడు. వీసా లాటరీ సిస్టమ్‌ను అమెరికా తొలగించడంతో.. భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ చర్యతో వర్క్ వీసాలపై అమెరికాలో ఉంటున్న భారతీయ కార్మికులపై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది.




# ఓవరాల్ ఛాంపియన్ 'వరంగల్ ఆపరేషన్'

- ముగిసిన ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ పోటీలు

**వరంగల్ వాయిస్, విద్యుత్ భవన్ :** తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్ లో వరంగల్ ఆపరేషన్ టీమ్ ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచింది. సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు వరంగల్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 27 జట్లు పాల్గొన్నాయి. వరంగల్ ఆపరేషన్ టీమ్ వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ ఛాంపియన్స్ గా నిలిచారు. ఓపెన్ డబుల్స్ థర్డ్ ప్రైజ్‌ను వరంగల్ ఆపరేషన్ నుంచి హరీష్, రాజు గెలుచుకున్నారు. ఓపెన్ సింగిల్స్ రన్నరప్‌గా వరంగల్ ఆపరేషన్ నుంచి హరీష్ గెలుచుకున్నారు. విజేతలకు ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జి.సంపత్ కుమార్ బహుమతులు అందజేశారు.

# 22నుంచి భద్రకాళీ శరన్నవరాత్ర మహోత్సవాలు

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- భారీ బందోబస్తు, ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన భద్రకాళి శేషు, ఈఓ రాముల సునీత




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయంలో ఈ నెల 22 నుంచి పది రోజుల పాటు శ్రీ భద్రకాళీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, కార్యనిర్వహణాధికారి రాముల సునీత వెల్లడించారు. భద్రకాళి ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పది రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమ వివరాలను వెల్లడించారు. పది రోజుల అమ్మవారిని ఉదయం ఒక రూపంలో, సాయంత్రం మరొక రూపంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు. 22వ తేదీ సోమవారం శైలపుత్రీక్రమము, బాలత్రిపుర సుందరిగా, 23న అన్నపూర్ణాదేవిగా, 24న గాయత్రి అలంకారం, 25న శ్రీ మహాలక్ష్మీ అలంకారం, 26న శ్రీ రాజరాజేశ్వరీ లలితా మహా త్రిపుర సుందరిగా, 27న భువనేశ్వరీ అలంకారం, 28న భవానీ అలంకారం, 29న సరస్వతీ అలంకారం, 30న చద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా శ్రీ భద్రకాళీ మహాదుర్గాలంకారం, అదే విధంగా అక్టోబర్ 1వ తేదీ బుధవారం మహిషమర్ధినీ అలంకారంలో భక్తులకు దర్శనమీయనున్నారు. 2వ తేదీ విజయ దశమి సందర్భంగా కలశోద్వాసన, శ్రీ భద్రకాళి అమ్మవారి జలక్రీడోత్సవాన్ని నిర్వహించనున్నారు. బతుకమ్మ పండుగ అంకురార్పన సందర్భంగా సెప్టెంబర్ 21న హరిద్రాదర్శనము, శరన్నవరాత్రయాగ పూర్వాంగవిధి, అక్టోబర్ 3న శుక్రవారం ఏకాదశి తిథిన శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణం, పుష్పయాగం, నీరాజన మంత్ర పుష్పములు, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ అత్యంత వైభవంగా నిర్వహించుటకు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పార్నంది నరసింహమూర్తి, వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, ఎస్. శ్రీధర్ రావు, మూగా శ్రీనావాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

◆ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కే.ఆర్.నాగరాజు అన్నారు. శనివారం ఐనవోలు మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 27 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ. 27,03,132 విలువైన చెక్కులను, అలాగే 22 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) లబ్ధిదారులకు రూ. 6,82,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లి ఖర్చుల భారం తగ్గించే ఉద్దేశంతోనే ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వ అప్పుల భారాన్ని మోస్తూనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమాన్ని ఆపకుండా చూస్తున్నారని పేర్కొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేసిందని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్రంలోని 3.10 కోట్ల తెల్ల రేషన్ కార్డుదారులకు రూ. 13,500 కోట్లు ఖర్చు చేసి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరంలోనే 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 22,500 కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కొనియాడారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా వస్తుందని హామీ ఇచ్చారు. రైతులు ఎవరూ యూరియా విషయంలో ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే నాగరాజు భరోసా ఇచ్చారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. సరైన సమయంలో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందని, అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సకాలంలో స్పందించి రైతులకు యూరియా అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఎమ్మార్వో విక్రమ్, ఎంపీడీఓ నర్మద, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ మినిస్టర్ వివేక్ తో హ్యూమన్ రైట్స్ ప్రతినిధుల భేటీ




**వరంగల్ వాయిస్, తొర్రూరు:** భారత రాజ్యాంగ పరిరక్షణపై ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సెల్ విభాగాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్, హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ పాల్గొన్నారు. సదస్సులో మంత్రి వివేక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు మంత్రి వివేక్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య, మల్లెపాక రామచందర్, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు యాకయ్య, పల్లెర్ల రమేష్, శ్రీకాంత్, ప్రశాంత్, రాజేందర్, రామచందర్, భుజంగరావులతో పాటు సిద్దిపేట జిల్లాకు చెందిన లక్ష్మణ్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# ఫొటో ఎక్స్ పోకు తరలిన ఫొటోగ్రాఫర్లు



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** హైదరాబాద్‌లో జరగనున్న ఫొటో ఎక్స్ పో కార్యక్రమానికి హుజూరాబాద్, జమ్మికుంట మండలాల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు బయలుదేరారు. శనివారం హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో ఈ బృందం ప్రయాణం మొదలుపెట్టింది. ఈ సందర్భంగా హుజూరాబాద్‌లోని కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు మేకల తిరుపతి, కొలుగూరి కిరణ్, సీనియర్ నాయకులు సొల్లు బాబు.. అలాగే జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ జెండా ఊపి వారిని సాగనంపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే శుభకార్యాల్లో కీలక పాత్ర పోషిస్తారని, మధుర జ్ఞాపకాలను కెమెరాల్లో బంధించి వాటిని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేస్తారని కొనియాడారు. ప్రతి సంవత్సరం జరిగే ఫొటో ఎక్స్ పోలో కొత్త కొత్త కెమెరాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి ఫొటోగ్రాఫర్లు తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వెళ్తున్న ప్రతి సభ్యుడు కొత్త మెలకువలను నేర్చుకుని ఈ రంగంలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. హుజూరాబాద్, జమ్మికుంట మండలాల ఫొటోగ్రాఫర్లందరూ పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటు

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, దానిపై ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ శాయంపేట మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం శాయంపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టేకుమట్ల మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే తమ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై, ముఖ్యంగా అక్రమ ఇసుక రవాణాపై రోడ్డెక్కి ధర్నా చేశారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటానని బహిరంగంగా చెబుతున్నప్పటికీ, తన అనుచరుల ద్వారా అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ నాయకులే ఆరోపిస్తున్నారని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను నిలువరించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారంటే వారికి ఏమైనా లాభాలు అందుతున్నాయా అనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అక్రమ రవాణాకు అధికారులు ఎమ్మెల్యేకు కొమ్ముకాస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులే ధర్నాకు దిగారంటే, ఈ అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రైతులకు సరిపడా యూరియాను అందించడంలో విఫలమైన ఎమ్మెల్యే, ఇదే అదనుగా ఇసుక అక్రమ రవాణా ద్వారా పైసలు దండుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అక్రమాలను గమనిస్తున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే చెప్పులతో కొట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. టేకుమట్ల మండలంలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వంగల నారాయణరెడ్డి, రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, మేకల శ్రీనివాస్, మారపెల్లి నందం, మారపెల్లి మోహన్, అరికెళ్ల ప్రసాద్, దాసి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఫోన్ 17ను లాంచ్ చేసిన ఎమ్మెల్యే నాగరాజు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో కొత్త ఐఫోన్ 17 మోడల్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు లాంచ్ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రజల జీవితాలను సులభతరం చేస్తోందని, యువత టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఫోన్ వంటి ఆధునిక ఫోన్‌లు దేశంలో డిజిటల్ విప్లవానికి ఒక చిహ్నంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం మేనేజర్ వలీ, సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఏక్ పెడ్ మాకే నామ్' సర్టిఫికెట్ల అందజేత



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లులకు 'ఏక్ పెడ్ మాకే నామ్' (అమ్మ కోసం ఒక చెట్టు) కార్యక్రమం కింద సర్టిఫికెట్లు అందజేశారు. తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఈ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఏక్ పెడ్ మాకే నామ్' కార్యక్రమం ద్వారా విద్యార్థులలో చెట్ల పెంపకంపై అవగాహన పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మొక్కను తల్లితో సమానంగా భావించి, దానిని ప్రేమగా పెంచి పోషించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి పాఠశాల విద్యార్థులు తమ తల్లులతో కలిసి మొక్కలు నాటి, ఆ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిని అభినందిస్తూ కేంద్ర ప్రభుత్వం వారికి సర్టిఫికెట్లు జారీ చేసింది. వీటిని డౌన్‌లోడ్ చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశామని సుదర్శన్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో బతుకమ్మ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మలతో వచ్చి ఆడిపాడిన తల్లులకు ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా చీరలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్కవత్ దేవా, కంచ రాజకుమార్, మేకల సత్యపాల్, పుల్లూరి రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, అంగన్‌వాడీ టీచర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయానికి విరాళం



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రఖ్యాతి గాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయానికి గణపురం గ్రామానికి చెందిన మియాపురం లక్ష్మి, రవీంద్ర చారి దంపతులు రూ. 5,016 విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకుడు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, వారు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్‌కు అందజేశారు. కార్తీక మాసంలో జరగనున్న గణపతి శివలింగ నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం తమ వంతుగా ఈ విరాళం అందజేశామని లక్ష్మి, రవీంద్ర చారి దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండార్ శంకర్, మూలా శ్రీనివాస్, పట్టిక స్వామి, బూరా రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడు, మాదాసు అర్జున్ గౌడ్, ఉయ్యాల బిక్షపతి గౌడ్, పాండవుల భద్రయ్య, దయ్యాల భద్రయ్య, మూటపోతుల రాజన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, సెప్టెంబర్ 20, 2025

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల ప్రత్యేక అధికారి బక్కి నవీన్ కుమార్, ఎంపీడీఓ గజ్జెల విమల పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని వారు సూచించారు. అనంతరం 'డ్రై డే' కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమల నివారణకు ఆశా వర్కర్లచే దోమల మందు, బ్లీచింగ్ చల్లించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువకుండా చూసుకోవాలని అధికారులు గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భార్గవి, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పింఛన్ పెంపునకు పంచాయతీ ముట్టడి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు తమ పింఛను పెంచాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు లేతకరి అవినాష్ మాదిగ, ఉపాధ్యక్షుడు చాకినారం రాజు పాల్గొన్నారు. తమకు పెరిగిన ధరలకనుగుణంగా పింఛను పెంచి ఆర్థికంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన ఫ్రొబెల్ మోడల్ హైస్కూల్ విద్యార్థిని



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రానికి చెందిన బొల్లి భవ్యశ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించి, తన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చింది. మండలంలోని ఫ్రొబెల్ మోడల్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన భవ్యశ్రీ, అనంతరం విద్యాన్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భవ్యశ్రీని ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్. కృష్ణ మాట్లాడుతూ భవ్యశ్రీ కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించిందని, ఇలాగే ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, భవ్యశ్రీ తల్లిదండ్రులు బొల్లి బాబు, ప్రేమలతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్‌ను శనివారం రేషన్ డీలర్లు కలిశారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సామల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి అమ్మ అశోక్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు తహసీల్దార్‌ను శాలువ, పూల బొకేతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి పాల్గొన్నారు.

# రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

◆ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ:** బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న యూరియా కొరతపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన రైతు కళ్యాణపు రాజమొగిలి (రవి) యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన రవి హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి రవి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. "పులిగిల్ల గ్రామానికి చెందిన రైతులకు వరికోలులో టోకెన్లు ఇచ్చి, ఆ టోకెన్లతో పరకాల సొసైటీలో యూరియా తీసుకోమని చెప్పడం ఏంటి?" అని ఆయన ప్రశ్నించారు. పంటలను కాపాడుకోవాలనే ఆందోళనతో యూరియా కోసం వెళ్తున్న రైతులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతుంటే, ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవని ఆయన గుర్తు చేశారు. రైతులు అధైర్యపడకుండా ధైర్యంగా నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి యూరియా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చివరగా, ప్రమాదంలో కాలు విరిగిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని, పరకాల ఆర్టీసీ డీఎం, వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, పులిగిల్ల మాజీ సర్పంచ్ పాలకుర్తి సదానందం, తదితర నాయకులు పాల్గొన్నారు.

# వర్క్ షాప్ పేరుతో టీచర్లను వేధిస్తే సహించేది లేదు

తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ ఆగ్రహం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దసరా సెలవుల సమయంలో వర్క్‌షాప్, ట్రైనింగ్ పేరుతో ఉపాధ్యాయులను వేధించినా, మానసికంగా ఇబ్బంది పెట్టినా సహించేది లేదని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ (టీపీటీఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునీల్ కుమార్ హెచ్చరించారు. ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు అన్ని పాఠశాలలకు దసరా సెలవులు ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఉపాధ్యాయులను రమ్మని ఆదేశాలు జారీ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ సెలవుల్లో మహిళా ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలనుకుంటారని తెలిపారు. కానీ కొన్ని యాజమాన్యాలు 'స్కూల్‌కు వస్తేనే జీతాలు ఇస్తాం, లేకపోతే ఉద్యోగం నుండి తొలగిస్తాం' అని బెదిరింపులకు దిగుతున్నాయని ఆయన మండిపడ్డారు. సెలవులు రాగానే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు ఈ బెదిరింపుల వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని సునీల్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై జిల్లా విద్యా శాఖ అధికారులు జోక్యం చేసుకుని అన్ని పాఠశాలలకు కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. ఎక్కడైనా ప్రైవేట్ టీచర్లను ఇబ్బంది పెట్టినట్లు తమ దృష్టికి వస్తే, ఆ పాఠశాల ముందు ధర్నా చేసి, ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేసే వరకు కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ నాయకులు రవి, సూర్యచంద్ర, అశోక్, అనిల్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# నర్సంపేట రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నర్సంపేట రోడ్డులో ఉన్న శ్రీ కనకదుర్గ మాత ఆలయం, దయానంద కాలనీ మెయిన్ రోడ్డు కూడలి వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారి ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి అధికారులు ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్స్ (ట్రంబుల్ స్ట్రిప్స్) ఏర్పాటు చేశారు. శనివారం ఈ పనులను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటుతో అవి గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, పప్పు వేణు, ఠాగూర్ బజరంగ్ సింగ్, గూడ నవీన్, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గూడ శారద, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ రమ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

# 21 నుంచి సీపీఐ జాతీయ మహాసభలు

◆ తెలంగాణ రాష్ట్రం నుంచి 82 మంది ప్రతినిధులు
◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 25వ జాతీయ మహాసభలు నేటి నుండి ఈనెల 25 వరకు చండీగఢ్‌లో జరుగుతాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 21న మొహాలీలో జరిగే బహిరంగ సభతో ఈ మహాసభలు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి 800 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని, తెలంగాణ నుంచి 82 మంది ప్రతినిధులు, 8 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొంటారని శ్రీనివాసరావు తెలిపారు. ఈ మహాసభలలో దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, దేశానికి వామపక్షాల ఆవశ్యకత, వాటి బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ వంటి అంశాలపై చర్చ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, అదానీ, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జీఎస్టీ వంటి అంశాలతో సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఆయన ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్ వంటి స్వయం ప్రతిపత్తి గల కేంద్ర సంస్థలను బీజేపీ తమ గుప్పిట్లో పెట్టుకుని దుర్వినియోగం చేస్తోందని శ్రీనివాసరావు విమర్శించారు.




ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, దేశ సమగ్రత, ఐక్యత ప్రజా పోరాటాల ద్వారానే సాధ్యమని, దీనికి దేశవ్యాప్తంగా బలమైన వామపక్ష ఉద్యమం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. వామపక్షాల ఐక్యత తక్షణ అవసరమని, దేశంలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యం కావాలని ఈ మహాసభలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. మతోన్మాద రహిత భారత్ కోసం ఐక్య పోరాటాలు అవసరమని చెప్పారు.

# రెహాన్ మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

■ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 29వ డివిజన్, రామన్నపేటకు చెందిన ఎండీ రెహాన్ (18) ఇటీవల భద్రకాళి చెరువులో పడి మరణించిన ఘటనపై ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర విమర్శలు చేశారు. శనివారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో స్థానిక ఎమ్మెల్యే, మేయర్ అవినీతికి పాల్పడుతూ ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. పూడికతీత పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికే ముగ్గురు చెరువులో పడి చనిపోయారని, పాలకులకు డబ్బు సంపాదనపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలను కాపాడడంపై లేదని విమర్శించారు. రెహాన్ మృతికి కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం, అవినీతే కారణమని ఆయన అన్నారు. ఈ దుర్ఘటన జరిగిన తర్వాత కూడా పాలకులు, అధికారులు ఇంతవరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. మృతుడు రెహాన్ కుటుంబానికి రూ. 20 లక్షల నష్టపరిహారంతో పాటు, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సదాంత్, ఎండీ షఫీ, తాళ్లపెల్లి రమేష్, గట్టు చందు, రాచర్ల జగన్, ఎండీ థైసిల్, బొమ్మకంటి క్రాంతి, ఇజగిరి భీమరాజ్, మాల్వ రాజు, బుస శేఖర్, వాసు, మౌనిక, విద్య, మైదం కర్ణాకర్, గొర్రె అరుణ్, పూజారి సారంగం, సూరం గోపి, ముత్యాల మహేందర్, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఎమ్మెల్యే నాయిని కృషి

## నేటి నుంచి అమలులోకి ఆరోగ్య శ్రీ సేవలు

## నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె విరమణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మూడు రోజులుగా నిలిచిపోయిన ఆరోగ్య శ్రీ సేవలు రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు యాజమాన్యాలు సమ్మెను విరమించడంతో వేలాది మంది నిరుపేద రోగులకు వైద్య సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. ఈ సమస్య పరిష్కారంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించిన బకాయిలు, విధానాలపై ఏర్పడిన వివాదాలతో ప్రైవేట్ ఆస్పత్రులు సేవలను నిలిపివేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే నాయిని మూడు రోజులుగా ప్రభుత్వానికి, ఆస్పత్రుల యాజమాన్యానికి మధ్య వారధిగా వ్యవహరించారు. ఆయన ప్రైవేట్ ఆస్పత్రుల రాష్ట్ర కమిటీ సభ్యులతో నేరుగా చర్చించి, వారి సమస్యలను విన్నారు. అదేవిధంగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలతో కూడా చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారు. ఆయన చొరవతోనే నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెను విరమించడానికి అంగీకరించాయి. దీంతో నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆరోగ్య శ్రీ గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీ సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరటనిచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# కొత్త కాలనీల్లో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తా

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని కొత్తగా ఏర్పడుతున్న కాలనీల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాను కృషి చేస్తున్నానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం డివిజన్‌లోని ఉప్పరోనికుంట కాలనీ ప్రజలు తాగునీరు, డ్రైనేజీలు, మొరం రోడ్డు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కార్పొరేటర్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవి మాట్లాడుతూ, ఉప్పరోనికుంట ప్రజలు ప్రస్తుతం ఫ్లోరైడ్ నీరు తాగి ఇబ్బందులు పడుతున్నారని, దీని వల్ల ఇంట్లోని వస్తువులతో పాటు కుటుంబ సభ్యులు కూడా అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సహకారంతో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించి, ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఈ ప్రాంతంలో డ్రైనేజీలు, మొరం రోడ్డు వేయించడానికి మేయర్, కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కంచమల్లయ్య, సుతారి కనకయ్య, మొగుళ్ల రాజకుమార్, తిప్పని కుమార్ ఉన్నారు.

# సంక్షేమ పథకాలు కాంగ్రెస్ వారికేనా ?

- ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి
- అఖిలపక్ష నాయకుల ఆగ్రహం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకే అమలు చేస్తున్నారని, అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం ఆరోపించారు. శనివారం అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండలం, నాగయ్యపల్లి గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, రాజీవ్ యువ వికాసంతో పాటు ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరుగుతోందని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఈ సందర్భంగా మాదాసి సురేష్, ఇర్సడ్ల సదానందం మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా, గ్రామసభల ద్వారా మాత్రమే జరగాలని డిమాండ్ చేశారు. అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజనీకాంత్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు పోగుల యాదగిరి, మాజీ సర్పంచ్ మాదాసి సాంబయ్య, గడ్డం స్వామి, మోరే ఐలయ్యతో పాటు పలువురు దరఖాస్తుదారులు, నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎస్సాఆర్



**వరంగల్ వాయిస్, గణపురం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఆయన సతీమణి పద్మ శనివారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, అధికారులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు శ్రీ ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణీంద్ర శర్మ, ఇతర అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం వేద ఆశీర్వచనం వేదికపై ప్రధానార్చకులు ఫణీంద్ర శర్మ శేష వస్త్రాలతో ఎమ్మెల్యే దంపతులను సత్కరించి ఆశీర్వదించారు. స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

# ఖిలా వరంగల్ తహసీల్దార్ గా ఇక్బాల్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** వరంగల్ మండల తహసీల్దార్‌గా పనిచేసిన మహమ్మద్ ఇక్బాల్, ఖిలా వరంగల్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఖిలా వరంగల్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ బదిలీతో ఖిలా వరంగల్ మండలంలో పరిపాలన మరింత మెరుగుపడుతుందని ఆశించవచ్చు.

# హామీలు తప్ప అమలు జాడ లేదు

## తెలంగాణ ప్రభుత్వంపై పీడీఎస్‌యూ విమర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆరోపించింది. హనుమకొండలోని కాళోజీ జంక్షన్ వద్ద ఉన్న జార్జిరెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు వారు తీర్మానించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. వెంకటరెడ్డి, ఎ. సాంబ మాట్లాడుతూ, ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి తన వద్దనే విద్యాశాఖను ఉంచుకొని కొత్త మార్పులు తీసుకొస్తానని చెబుతున్నా, గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8,000 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌ల సమస్యను పరిష్కరించలేదని అన్నారు. దశలవారీగా రూ. 600 కోట్లు, రూ. 500 కోట్లు విడుదల చేస్తామని చెప్పడం విద్యార్థులను మోసం చేయడమేనని వారు అన్నారు. రాష్ట్ర యూనివర్సిటీలలో సమస్యలు తాండవిస్తున్నాయని, అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని పేర్కొన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హాస్టళ్లలో కూడా విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. సతీష్, ఆర్. రంజిత్, సహాయ కార్యదర్శి మిశ్రిన్ సుల్తానా, కె. గణేష్, వంశీకృష్ణ, అర్జున్, జె. గణేష్ పాల్గొన్నారు.

# కనకదుర్గ మాత దేవాలయంలో దసరా ఉత్సవాలు

◆ ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శ్రీ కనకదుర్గ మాత దేవస్థానంలో దసరా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం (సెప్టెంబర్ 22, 2025) ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ తెలిపారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ఈ ఉత్సవాలు అక్టోబర్ 2, 2025 గురువారం వరకు జరుగుతాయని మీసాల ప్రకాష్ తెలిపారు. ఈ తొమ్మిది రోజుల పాటు ఆలయంలో నవ చండీ హోమం నిర్వహిస్తామని, అర్చకులు శ్రీధరాచార్యులు, వంశీ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. వరంగల్



నగర ప్రజలందరూ అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పప్పు వేణు, సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వరియా సురేష్ కుమార్, కొప్పుల సరోజన, కొంక వెంకటేశ్వరరావు, జంగం ప్రభాకర్, గూడ శారదతో పాటు అర్చకులు శ్రీధరాచార్యులు, వంశీ శర్మ, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు బతుకమ్మ సంబురాలు



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సంబురాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్యాల సంపత్ రెడ్డి మాట్లాడుతూ పూలను దైవంగా భావించే ప్రత్యేక పండుగ బతుకమ్మ అని, ఇది మహిళలకు ఎంతో ఇష్టమైన, ప్రకృతిని ఆరాధించే పండుగ అని అన్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు కటుకోజ్వల సతీష్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అత్యంత ముఖ్యమైన పండుగ బతుకమ్మ అని కొనియాడారు. బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రతీకగా నిలిచి, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని తెలియజేస్తుందని ఆయన అన్నారు. ఈ సంబురాల్లో పాఠశాల ఉపాధ్యాయులు ఉమా, పద్మ, కవిత, ప్రదీప్, రాజేష్, సూరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన వర్కర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పబ్బ సరిత, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అరవింద పబ్లిక్ స్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** ఖిలా వరంగల్‌లోని 42వ డివిజన్ రంగశాయిపేటలో ఉన్న అరవింద పబ్లిక్ స్కూల్‌లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నర్సయ్య మాట్లాడుతూ ప్రకృతిలో లభించే పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, అందులో గౌరీదేవిని అలంకరించి ఆడిపాడతారని తెలిపారు. బతుకమ్మ సాక్షాత్తు అమ్మవారి స్వరూపంగా భావించే ఈ పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని చెప్పారు. బతుకమ్మ పండుగ ప్రధాన ఉద్దేశం పార్వతీ దేవి ఆశీర్వాదం పొందడం, ప్రకృతికి కృతజ్ఞతలు తెలియజేయడమని ఆయన అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మలను పేర్చుకొని వచ్చి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రభుత్వ సహాయక ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ లయన్ గుజ్జారి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సంబురాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరునగరి నరేందర్, ఉపాధ్యాయులు బెల్లంకొండ పూర్ణచందర్, మనోజ్, సునీత, అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు ఉమ, నాహిద్, రాధిక తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని ఆడిపాడారు. బతుకమ్మ పాటలతో, కోలాటాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

## గోపాలపూర్ ఎస్ఆర్ డీజీ పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, గోపాలపూర్:** గోపాలపూర్‌లోని ఎస్ఆర్ డిజి పాఠశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోనల్ మేడం రమ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణలో మాత్రమే జరుపుకునే అతిపెద్ద పూల పండుగ అని, ఇది ప్రకృతిని ఆరాధించే పండుగ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేడం, ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిట్స్ అశ్మక పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్‌లోని కాశిబుగ్గలో ఉన్న బిట్స్ అశ్మక పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సంబురాల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా, తొమ్మిది రోజులకు అనుగుణంగా విద్యార్థులు తొమ్మిది మంది అమ్మవారి రూపాలను తయారు చేసి ప్రదర్శించారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేశారు, ఇది చూసేవారిని ఆకట్టుకుంది. బిట్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేందర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే పూల పండుగ అని పేర్కొన్నారు. ఇది ప్రకృతితో ముడిపడిన పండుగ అని, బతుకమ్మలను పేర్చడానికి ఉపయోగించే ఆకులు, పూలు ఔషధ గుణాలు కలిగి ఉంటాయని, వాటిని చెరువులో నిమజ్జనం చేయడం వల్ల నీరు శుద్ధి అవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఈ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, దామెర :** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఒగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథుగా తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవో కల్పన హాజరు కాగా, పాఠశాలకు చెందిన 200 మంది బాలికలు, 650 మంది బాలురు, యాజమాన్యం, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శోభారాణి, విజయలక్ష్మి, కావ్య, మీన, రచన, హరితా భాను మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల పండుగ అని, ఇది మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. విద్యార్థులు అన్ని పండుగలను ఉత్సాహంగా జరుపుకోవాలని, మన ఆచారాలను ఎప్పటికీ మర్చిపోకూడదని వారు సూచించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వేడుకలను నిర్వహించారు.

## షైన్ కళాశాలలో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలో ఉన్న షైన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబురాలను విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, ఆరూరి కవిత, మూగుల రమేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షైన్ విద్యా సంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి పండుగల విశిష్టతలను తెలుసుకోవాలని సూచించారు. బతుకమ్మ పండుగ తెలంగాణలో మాత్రమే జరుపుకునే ప్రకృతి ఆరాధన పండుగ అని, ఇది పూలు బాగా వికసించే సమయంలో జలవనరులు పొంగిపొరలేటప్పుడు భూమికి, ప్రకృతికి, మానవుడికి ఉన్న అనుబంధాన్ని చాటి చెబుతుందని ఆయన అభివర్ణించారు. ఆటలు, పాటలు విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి తోడ్పడతాయని ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో షైన్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, పి. శ్రీనివాస్ గౌడ్, రాజ్‌కుమార్, సబిత, ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.


# పెద్దకొడపాక క్రాస్ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి

◆ ఆర్టీసీ అధికారులకు మాజీ సర్పంచ్ రవీందర్ విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, శాయంపేట:** హనుమకొండ–పరకాల మార్గంలో ఉన్న పెద్దకొడపాక గ్రామం క్రాస్ వద్ద బస్ స్టాప్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామ మాజీ సర్పంచ్ ఇమ్మడిశెట్టి రవీందర్ తెలిపారు. వందలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో బస్ స్టాప్ లేకపోవడం వల్ల బస్సుల కోసం ఎదురుచూసి నిరాశ చెందుతున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. "బస్సు ఆపను, నీకు దిక్కున్న చోట చెప్పు" అంటూ డ్రైవర్లు ప్రజలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లలిత రెస్టారెంట్ సమీపంలో తక్షణమే ఒక రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని పరకాల డిపో మేనేజర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. బస్ స్టాప్ ఏర్పాటుతో పెద్దకొడపాక గ్రామ ప్రజల కష్టాలు తీరడంతో పాటు, ప్రయాణికులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



# శివ..మూవీ రీరిలీజ్





కొన్ని సినిమాలు ఎప్పటికీ ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోతాయి. వాటిలోని సన్నివేశాలు ఎప్పటికీ ట్రెండిరగ్‌లో ఉంటుంటాయి. అలాంటి వాటిలో ఒకటి 'శివ'. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా నాగార్జున దీని రీ రిలీజ్ తేదీని ప్రకటించారు. నవంబర్ 14న ఈ సినిమా 4కే వెర్షన్‌లో విడుదల కానున్నట్లు– తెలిపారు. 1989లో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై 'శివ' విడుదలై టాలీవుడ్‌లో చరిత్ర సృష్టించింది. 'శివ' సినిమాకు ముందు దీని తర్వాత అనేంతగా ప్రభావం చూపింది. దీని రీరిలీజ్ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. 'కొన్ని సినిమాలు తరాలు మారినా నిత్యనూతనంగానే ఉంటాయని నాన్న అనేవారు. అలాంటి చిత్రాల్లో 'శివ' కూడా ఒకటి. ఇప్పుడీ సినిమాను 4కేలో రిలీజ్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు ఇది మా నివాళి' అని తెలిపారు. మాఫియా నేపథ్యంలో కాలేజీ కుర్రాళ్ల మధ్య జరిగే రాజకీయాలపై ఈ సినిమా రూపొందింది. నాగార్జున సరసన అమల నటించిన ఈ చిత్రంలోని పాటలు నేటికీ –టె–ండిరగ్‌లో ఉన్నాయి.



# షారూక్ తో ఆరోసారి..

## ఆ విషయాలు ఆయన నుంచే నేర్చుకున్నాను : దీపిక



ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన దీపిక.. తన తాజా పోస్ట్‌తో మరోసారి వైరల్‌గా మారారు. భారీ ప్రాజెక్ట్ 'కల్కి 2' నుంచి ఆమెను తొలగించడంపై రకరకాల కామెంట్స్ వినిపిస్తోన్న నేపథ్యంలో నటి తాజాగా ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్‌తో కలిసి ఆమె ఆరో సినిమా చేయడం గురించి ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా షారుక్ తనకు నేర్పిన పాఠం గురించి ప్రస్తావించారు. అయితే ఆమె పరోక్షంగా 'కల్కి 2' గురించే మాట్లాడారని సోషల్ మీడియాలో నెటిజన్లు చర్చించుకుంటున్నారు. 18 ఏళ్ల క్రితం 'ఓం శాంతి ఓం' సినిమా చేస్తున్నప్పుడు నాకు షారుక్ కొన్ని పాఠాలు నేర్పారు. సినిమాతో మనం ఏం నేర్చుకున్నాం.. అందులో ఎవరితో చేస్తున్నామనే విషయాలే.. సినిమా విజయం కంటే ప్రాధాన్యమైన అంశాలని చెప్పారు. నేను ఆ మాటలనే పూర్తిగా నమ్ముతాను. అప్పటినుంచి నేను తీసుకునే ప్రతి నిర్ణయం వెనక ఆ పాఠాన్నే అమలుచేస్తున్నానని తెలిపారు. ఇక తాను షారుక్‌తో ఆరో సినిమాలో నటిస్తున్నట్లు– చెప్పారు. ప్రస్తుతం దీపిక కామెంట్స్ వైరల్‌గా మారాయి. షారుక్, దీపికల కాంబో 'కింగ్' సినిమా తెరకెక్కుతోంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఇది రానుంది. ఇక 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్‌లో దీపిక నటించడం లేదంటూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ దీనిపై పరోక్షంగా పోస్ట్ పెట్టారు. జరిగిన దాన్ని ఎవరూ మార్చలేరు. కానీ, తర్వాత ఏం జరగాలో మీరు ఎంచుకోవచ్చని రాసుకొచ్చారు. ఈ వ్యవహారంపై దీపిక ఎలా స్పందిస్తారా అని అందరూ అనుకున్నారు.

# మహాభారతం నా 30 ఏళ్ల కల

## ఇది సినిమా కాదు.. ఓ యజ్ఞం

'మహాభారతం' సినిమా కోసం తాను 30 ఏళ్ల నుంచి కలలు కంటున్నట్లు– ఆమిర్ ఖాన్ తెలిపారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్‌పై అప్‌డేట్ ఇచ్చారు. ఈ ఇతిహాసానికి జీవం పోయడానికి తాను మూడు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తున్నట్లు– తెలిపారు. ఇది తన జీవితంలో అత్యంత ముఖ్యమైన ప్రాజెక్ట్ అని చెప్పారు. ఈ సినిమా కోసం ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మరో రెండు నెలల్లో స్క్రిప్ట్ పనులు మొదలుకానున్నాయి. దీనిని ఒక సినిమాగా కాకుండా యజ్ఞంలా పూర్తి చేయాలనుకుంటున్నా. ఈ సినిమా కోసం 30 సంవత్సరాలుగా ప్రణాళికలు వేసుకుంటున్నాను. ఇది నా జీవితంలోనే అతి ముఖ్యమైన ప్రాజెక్ట్. దీనికి ఎక్కువ సమయం పడుతుంది. మీ అందరూ మెచ్చేలా రూపొందించాలనుకుంటున్నా. దీనికోసం మీరంతా సిద్ధంగా ఉండాలి' అని ఆమిర్ తెలిపారు. గతంలో కూడా ఆయన ఈ సినిమా గురించి మాట్లాడారు. దీన్ని ఒకే భాగంలో చూపించలేమని.. అందుకే సిరీస్‌లుగా అందించాలని నిర్ణయించుకున్నట్లు– చెప్పారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ రూపొందనున్నట్లు– తెలిపారు. ఇండస్ట్రీలో ఎంతోమంది దర్శకులు దీనికోసం వర్క్ చేయనున్నారని .. స్టోరీ రాయడం పూర్తైన తర్వాత నటీనటులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఇక ఆమిర్‌ఖాన్ ఇటీ–వలే 'సితారే జమీన్ పర్', 'కూలీ' సినిమాలతో ప్రేక్షకులను మెప్పించారు. ప్రస్తుతం 'లాహోర్: 1947'లో నటించేందుకు సిద్ధమయ్యారు. రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. ఇందులో సన్నీదేవోల్ కీలకపాత్రలో కనిపించనున్నారు.





# 25 వరకు ఉంటామో పోతామో

## ఓజీ హైప్‌పై సిద్ధూ కామెంట్స్

పవన్ కల్యాణ్ అభిమానులతో పాటు– సినీప్రియులంతా ఎదురుచూస్తోన్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే దీనిపై వరుస పోస్ట్‌లతో పవన్ అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తున్నారు. ఇప్పుడు వీరి జాబితాలో యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ చేరారు. తాజాగా సిద్ధూ 'ఓజీ' హైప్ గురించి తన స్టైల్‌లో పోస్ట్ పెట్టారు. దాన్ని అభిమానులు షేర్ చేస్తున్నారు. ఓజీ' హైప్ ప్రభావం మా హెల్త్‌పై పడేలా ఉంది. 25 వరకూ మేం ఉంటామో, పోతామో కూడా అర్థం కావట్లేదు. ఇప్పుడే ఇలాఉంటే ఇక 25 తర్వాత పరిస్థితి ఏంటో?. మీరు పవన్ కాదు.. మీరు గాలి తుపాను..' అంటూ పవన్‌ను తన పోస్ట్‌కు ట్యాగ్ చేశారు. దర్శకుడిని ట్యాగ్ చేస్తూ ఓజీ ఓ అద్భుతం అని సిద్ధూ పేర్కొన్నారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. తాజాగా ఇందులో పవన్ పాడిన జపనీస్ పాటను విడుదల చేసింది. చిన్నప్పుడు నా గురువు చెప్పిన హైకూ చెప్తాను విను. వాషి యో వాషి.. అంటూ పవన్ చెప్పిన ఈ జపనీస్ హైకూ ఆకట్టుకుంది.



# ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- కమిషనర్‌తో కలిసి బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలు ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శనివారం బోడగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పక్షం రోజులపాటు నిర్వహించనున్న స్వస్థ్ నారీ శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై సమీక్షించారు. ఇప్పటివరకు మహిళలకు ఏ విధమైనటువంటి ఆరోగ్య సమస్యలకు సేవలు అందించారంటూ అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరం ఎలా ఉందంటూ అక్కడకు వచ్చిన మహిళలను అడిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు, టీబీ స్క్రీనింగ్, నిర్ధారణ, రక్తహీనత, చెవి ముక్కు గొంతు పరీక్షలు, చర్మ సంబంధ వ్యాధులు, దంత సంబంధ వ్యాధులు, మానసిక సంబంధ వ్యాధులు మొదలైనటువంటి పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాలపై మహిళలకు తెలియజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. బోడగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ సృజన జెరూష, హెల్త్ అసిస్టెంట్లు, సిస్టర్లు, ఫార్మసిస్ట్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన..**

చారిత్రక వేయి స్తంభాల ఆలయం వద్ద రాష్ట్ర స్థాయి బతుకమ్మ వేడుకల ప్రారంభోత్సవ ఏర్పాట్లను గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డీసీపీ షేక్ సలీమా, ఇతర శాఖల అధికారులతో కలిసి హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఏర్పాట్లను మున్సిపల్, పోలీస్, విద్యుత్, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. బతుకమ్మ ఉత్సవాల్లో లక్ష మంది మహిళలు పాల్గొనే అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా విద్యుద్దీపాలు, తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ ఏసీపీ నరసింహారావు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పశుసంవర్ధక శాఖలో.. పదోన్నతుల పండుగ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాదు సీతారాం బాగ్ లోని తెలంగాణ నాన్ గెజిటెడ్ వేటేరినెరియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాన్ గెజిటడ్ క్యాడర్ లో శనివారం భారీ ఎత్తున పదోన్నతులు కల్పించారు. సుమారు 610 ఉద్యోగులకు నాలుగు క్యాడర్లలో పదోన్నతులు కల్పించిన సందర్భంగా గౌరవ పశుసంవర్ధక శాఖ, మత్స్య, క్రీడా శాఖ మాత్యులు డాక్టర్ వాకిటి శ్రీహరిని అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ పురోభివృద్ధికి సిబ్బంది సమష్ఠిగా కృషి చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ సంచాలకు డాక్టర్ బి.గోపి గారు మాట్లాడుతూ ఒకేరోజు పారదర్శకంగా కౌన్సిలింగ్ పద్ధతిలో పదోన్నతులు కల్పించామన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, తెలంగాణ నాన్ గెజిటెడ్ వేటరినెరియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్, కార్యదర్శి అభిషేక్ సహఅధ్యక్షుడు రతన్, కోశాధికారి సుధాకర్ గౌడ్, నాగేందర్, వేణుగోపాల్, వెంకటేశ్వర్ రావుతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి సుమారు 500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ముందస్తు ఉత్సవాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కులం, మతం, బీద, గొప్ప అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్క మహిళ కలిసి మెలిసి ఆడుకునే గొప్ప పవిత్రమైన పండుగ బతుకమ్మ పండుగ అని కొనియాడారు. సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవుడిని పూజించే పూలనే పూజించే గొప్ప పవిత్రమైన పండుగ బతుకమ్మ అన్నారు. విద్యార్థునులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మీ భవిష్యత్ మీ చేతిల్లోనే ఉందని, కృషి పట్టుదలతో చదివి మీ కుటుంబానికి, సమాజానికి దేశానికి గర్వకరణం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ రామచంద్రం, ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.



**సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ..**

ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేదలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు మంజూరు అయ్యాయి. శనివారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో 17 మంది లబ్ధిదారులకు రూ.6,87,500 విలువగల చెక్కులను కడియం కావ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




# ఉజ్జయినిలో.. ఉదయం మిత్రమండలి

## పాల్గొననున్న సీనియర్ జర్నలిస్టులు

వరంగల్ వాయిస్, వరంగల్ : ఉదయం తెలుగు దినపత్రిక మిత్ర మండలి వెల్ఫేర్ అసోసియేషన్ 5వ ప్రత్యేక సమావేశం ఈనెల 22న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం ఉజ్జయినిలో జరగనుంది. ఈ సమావేశానికి హాజరు కావడానికి సంఘం అధ్యక్షులు, జర్నలిస్టుల సంఘం నాయకుడు, ప్రముఖ పాత్రికేయుడు దాసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కన్నా పరశురాములు, కోశాధికారి అచ్యుత రఘునాథ్ లతోపాటు ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఉదయం 8.50కి వరంగల్ నుంచి అహల్య నగరి సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ లో బయలుదేరి వెళ్లనున్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో ఉదయం మిత్రమండలి భవిష్యత్ ప్రణాళిక, ఉదయం జ్ఞాపకాలతో కూడిన స్మరణిక ముద్రణ గురించి చర్చించనున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఉదయం దినపత్రికలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాత్రికేయులుగా పని చేసిన వారు ఉదయం పత్రిక మూతపడ్డాక నిరుత్సాహపడకుండా వివిధ రంగాలలో స్థిరపడి గత సంవత్సరం ఒక సంఘంగా ఏర్పడి ఇప్పటివరకు నాలుగు సమావేశాలు నిర్వహించుకుని, విజయవంతంగా ఆర్థిక పొదుపు సంఘాన్ని నిర్వహిస్తూ పాత్రికేయులకు ఆదర్శంగా నిలిచారు. అంతేకాకుండా తమ సమావేశాన్ని ఇతర రాష్ట్రాల్లో నిర్వహించుకోవడం ఒక చారిత్రక ఘట్టంగా భావిస్తున్నారు. ఉదయం దినపత్రికలోనే పనిచేసిన ఓంకార్ సింగ్ వారం క్రితమే ఉజ్జయినికి వెళ్లి అక్కడ సమావేశానికి కావలసిన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండడం పూర్వ పాత్రికేయుల ఐక్యతను చూసి ప్రస్తుత పాత్రికేయులు ప్రశంశల వర్షం కురిపిస్తున్నారు.




# విల్లో వుడ్ నూతన ఉత్పాదకాల ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** విల్లో వుడ్ కెమికల్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బిజినెస్ పార్ట్ నర్స్ సదస్సు శనివారం వరంగల్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సౌత్ బిజినెస్ హెడ్ ఎస్.మైత్రి కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత దేశంలో రూ.2,500 కోట్ల వ్యాపారం జరిగిందని వివరించారు. సీనియర్ జోనల్ మేనేజర్ సురేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్లు, డీలర్ల సహాయ సహకారంతో కంపెనీ అనేక విజయాలు సాధించిందని, భవిష్యత్ లో ఇలాగే సహకారం అందించాలని కోరారు. అందుకు మీకందరికీ ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. సీనియర్ డీజీఎం పొన్నమ్ సురేశ్ కుమార్ మూడు కొత్త ఉత్పాదనలు డాక్టర్ వెల్లాక్ష్, ఆబాక్సీ, టఫెక్స్ 369 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం నరేశ్ రెడ్డి, ఏఎస్ఎం అశోక్, డీఈ నిశాంత్ తోపాటు ఉమ్మడి వరంగల్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

# మాసూమ్ అలిలో బతుకమ్మ సంబరాలు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** పోచమ్మ మైదానం సమీపంలోని ఎల్ బీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలిలో శనివారం బతుకమ్మ సంబరాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బీవీఎన్ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ స్పోర్ట్స్ అధ్యక్షులు గుండేటి రమణయ్య, ఉపాధ్యక్షులు పోశాల సురేందర్ అతిధులుగా పాల్గొని సంబురాల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థినికి బహమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయబాల రెడ్డి, కనకయ్య, కె.కమలాకర్, బిక్షపతి, ఠంయ్యాల శ్రీధరాచార్యులు, కిషన్, మోహన్, బాస్కర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోషేప్, ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీలత, నవ్య, ట్రేయినీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com